పుష్యమాసం. కొరికే చలి. అమావాస్య కటిక చీకటి. కరవది స్టేషన్‌లో రైలు ఆగటంతో జనరల్ కంపార్ట్‌మెంటులో కృష్ణ, శాంతి ఎక్కికూచున్నారు.

ట్రైన్‌లో లైట్లు లేవు. సూట్‌కేసూ, హేండ్‌బాగూ సర్ది యిద్దరూ కూర్చుండీ, కూర్చోనకముందే కృష్ణ యేదో అలికిడి విన్నాడు. టార్చ్‌వేసి చూస్తే... ఏభైపైబడ్డ ముసలాయన, చలికి వంకర్లు తిరిగి పోతున్న ముసలావిడకి దుప్పటిచ్చాడు కప్పుకోమని.

కిటికీలు దగ్గరగా వేసి, ఆదుర్దాగా సూట్‌కేసు తెరిచిచూసి... "హమ్మయ్య" అనుకున్నాడు కృష్ణ.

"ఏవండీ! ఏమిటి వెతుకుతున్నారు?" శాంతి అడిగింది.

"ఏంలేదు! పిన్నికోసం తెచ్చిన దుప్పటి ఉందోలేదోనని చూస్తున్నా"

"ఉన్నదిగదా?"

"ఆ -"

"నిన్న మీరు శ్రమపడి, పదిషాపులు తిరిగి కొన్నదుప్పటి అది. జాగ్రత్తగా ఉంచండి" అని శాంతి కన్ను కురికింది.

కృష్ణకు నిద్రరాలేదు ఈ రోజు చాల భయంకరంగా ఉంది. ఆ చీకటి వలయంలో ఏవేవో జ్ఞాపకాలు తెరలు తెంచుకుని ముందు నిలిచాయి...

అది వేసవి కాలం. మే నెలాఖరుకు కృష్ణ యం. ఎస్సీ. ఫైనలు పరీక్షలు రాసి శలవుల్లో రామారావు బాబాయి దగ్గరకెళ్ళాలనుకున్నాడు. తనకోరిక అమ్మ, నాన్నలతో చెపితే వాళ్ళు ససేమిరా కాదన్నారు. కాని కృష్ణ పట్టుదలతో బాబాయి దగ్గర కెళ్ళాలనుకున్నాడు. బాబాయికి భ్రష్టుడు, దగుల్బాజీ అని అమ్మ బిరుదు లిచ్చింది. అవేమీ పట్టించుకోకుండా కృష్ణ చివరకి రామారావు బాబాయి వుండే మాలకొండకి వచ్చాడు. మాలకొండ చుట్టూ కొండలు. ఆమధ్యలో ఓ చిన్నవూరు, రామారావు పేరూ అదీ చెప్పి యింటికి వెళ్ళాడు కృష్ణ. ఎప్పటిదో యింటిలో వుండే ఫోటో చూసి పోల్చుకుని మరీ తను ఫలానా అని చెప్పుకున్నాడు. ఆరోజు అన్నకొడుకును చూసి రామారావు తన్నుతానే మరిచిపోయాడు. అన్న వదినలకు దూరమైనా తన్ను చూసేందుకు కృష్ణ వచ్చాడు. సీతకి కృష్ణను చూపించి ఫలానా అని చెప్పి పరిచయం చేశాడు. కుశల ప్రశ్నలయ్యాకస్నానాలు కానిచ్చి, భోజనం చేశారు.

వరండాలో రామారావు కృష్ణలు కూర్చున్నారు.

రామారావు యేదో ఆలోచిస్తున్నాడు.

"బాబాయ్! ఆమధ్య నీవు కనిగిరిలో టీచరుగా వున్నావన్నారు నాన్నగారు. మరి ఆవుద్యోగం యేమయింది! ఇప్పుడిక్కడ మీరున్నారని తెలిసి మిమ్మల్ని చూసి వెళ్దాం అని వచ్చా. కాని యిక్కడ రావాలంటే..." ఆగిపోయాడు కృష్ణ.

"నాకు తెలుసురా! జీవితంలో ఎవరు నా అనుకున్నానో వారికి నేను అక్కర లేకుండా పోయాను. నన్ను అంతగా ప్రేమించే అన్నా వదినలు నాకు దూరమయ్యారు. కాని నేను నమ్మిన ఆదర్శం కోసం సమాజానికి ఎదురీదుతూ ఇలా జీవిస్తూ వున్నా" రామారావు కంఠం గద్గదమైంది. కృష్ణ అందుకున్నాడు.

"అసలేం జరిగింది బాబాయ్?!"


"జరగవలసింది నా దృష్టిలో, జరగ కూడనిదీ సమాజం దృష్టిలో జరిగింది" అన్నాడు రామారావు.

"అంటే!?" కృష్ణ అదోలా చూస్తూ అడిగాడు.

రామారావు ఇలా చెప్పసాగాడు.

'నేను కొత్తగా బి.ఎ.బి.ఇడి. చదివి టీచర్‌గా కనిగిరి హైస్కూల్లో పని చేసే రోజులు అవి. నా బాల్య స్నేహితుడొకడు కనిగిరిలోనే లాయరు. ఎందుకో ఆరోజు కలవాలని నేను కోర్టు దగ్గర కెళ్ళా. అక్కడ తను ఓ వేశ్యకు శిక్షపడకుండా ఆమె తరపున వాదిస్తున్నాడు. తీరా ప్రాసిక్యూషన్ తప్పునీ, ఆమె విధిలేని పరిస్థితుల్లో వేశ్య అయ్యిందనీ వాదించి ఆమెను రక్షించాడు. కాంటీన్‌లోకొచ్చాక వాడుగా చెప్పగా తెల్సింది. ఆమె పేరు సీత. ఎవరో పెండ్లాడుతానని చెప్పి మోసం చేశార్ట. తనకున్నదల్లా తల్లి ఒక్కటే. ప్రేమ పేరు చెప్పి మోసగించిన కారణంగా సీత గర్భవతి అయింది. తనని మోసగించిన వాని వైనం, అతనిని కలుసుకోలేని తన అసహాయత తనకు తెలిసిన ఒకతనికి వివరించగా ఆ పెద్ద మనిషి అతని దగ్గరకు తీసుకు పోతానని భరోసా ఇస్తూ తనని కనిగిరి తీసికెళ్లాడు. కాని అతను సీతను అప్పగించింది ఓ వేశ్యాగృహానికి. కొన్నాళ్ళు పోయాక పోలీస్ రైడింగు జరగటం, ఈవిడపై కేసు పెట్టడం జరిగింది.

ఇది విన్న తర్వాత నాలోని రక్తంలో ఏదో ఆవేశం చోటుచేసుకుంది. నేను చదివిన, నమ్మిన ఆదర్శభావాలు నన్ను ఒక్కసారిగా ప్రశ్నించాయి నా అంతరాత్మని! 'నీవు ఎందుకు ఈవిణ్ని రక్షించవూ?' అని, అంతే, నేను సీతను ఉద్ధరిస్తానని పెండ్లాడి, బిడ్డకి కూడా తండ్రిగా



నిలబడతానని చెప్పి సీతను నాతో తీసికొచ్చా. ఆమె తల్లి కొన్నాళ్లకి ఈలోకం విడిచిపోయింది. సీతా నేనూ ఓ పెంకుటింట్లో అద్దెకుంటూ భార్యాభర్తలమై జీవించసాగాం.

అన్నావదినలకీ విషయం ముందుగానే వుత్తరం వ్రాశా. కాని వారినుండి ప్రోత్సాహం లేకపోగా, యిద్దరూ వచ్చి చెడామడా మాటలన్నారు. కాని నా ఆత్మస్థైర్యం దెబ్బతిన




లేదు. అన్నావదినల అనురాగానికి, అనుబంధానికీ దూరం అవటం బాధాకరమే అయినా నేను నమ్మిన ఆదర్శానికి బద్ధుడనయ్యాను. ఆ తర్వాత రాకపోకలు నామధ్య, అన్నావదినల మధ్యా తగ్గిపోయాయి.

ఈ సంఘటన జరిగేటప్పటికి నీకు నాలుగేళ్లనుకుంటా. చిన్నప్పటి నీ చిలిపి చేష్టలు, ముద్దుమాటల కోసం మీ యింటికి వద్దామని నా మనసు ఆరాటపడేది. కానీ...కానీ అన్నింటికన్నా సీత జీవితానికి రక్షణ కల్పించడం, ఆమెని నా అర్ధాంగిగా స్వీకరించడం. నా ప్రథమ ధ్యేయమైంది.

'......' కృష్ణతదేకంగా రామారావు వంక చూస్తుండి పోయాడు. రామారావు మళ్లీ చెప్ప సాగాడు.

'నాలుగునెలల తర్వాత సీతకో అబ్బాయి కలిగాడు. సంతోష్ అని ముద్దుగా పేరు పెట్టా... వాడు పెద్దవాడవుతూ లోకం పోకడ తెలుసుకున్నాడు కాబోలు, రానురాను మా విషయం గురించి తెలుసుకున్నాక వాడిలో ఎందుకో చెప్పలేని అసహ్యం, జుగుస్స, మా మీద యేర్పడ్డాయి. చీటికీ మాటికీ వాళ్లమ్మను ఎత్తిపొడవడం, నన్నెదిరించడం జరిగేవి... ఆఖరికి ఓరోజు సీతతో "ఛీ! నువ్వమ్మవు కాదు. పచ్చివేశ్యవి... లేకుంటే... నాన్న చనిపోయాక వీడితో..." సీత చెయ్యి చేసుకుంది. తర్వాత నేను అది చూసి నా దుఃఖాన్ని పైకివస్తుంటే ఆపుకున్నా. నాలో రగిలే ఆవేశం కట్టలు తెంచుకొని ప్రవహిస్తున్నా నేను వాడికి యేమీ సమాధానం చెప్పలేకపోయా. అది చూసివాడు "నేనీ కొంపలో క్షణముండను... ఆదర్శం, త్యాగం పేరుతో తండ్రిగా నిలిచి రండాకోరుతనం చేసే ఈ..." అనబోయేంతలో నేను చెయ్యి చేసుకోబోయి ఆగిపోయా. అవును. నేను పేరుకు తండ్రినే. నాకేం అధికారం వాడిమీద, వాడికీ పద్దెనిమిదేండ్లు నిండాయి. తెలిసో - తెలియకో, తను విన్నదీ, కన్నదీ - నిజమను

కున్నాడు. ఈ స్థితిలో వాడికి విచక్షణా జ్ఞానముండదు. నేను కండువా పై వేసుకొని వరండాలో కొచ్చా. అప్పుడే వాడు విసురుగా సీత వారిస్తున్నా వినకుండా యిల్లు విడిచి వెళ్ళిపోయాడు. మేం. వెదికించాం. కాని లాభం లేకపోయింది. నా అనుకున్న సంతోష్ నా జీవితంలో దుఃఖాన్ని మిగిల్చి వెళ్ళిపోయాడు. ఈ బాధను మరిచిపోతూ సీత, నేనూ, ఒకరికొకరు తోడుగా నీడగా నిలిచాం. మరి ఈ లోకం వూరుకోదు కదా. స్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శలు, గుసగుసలు మెదలుపెట్టారు. చుట్టుపక్కల ఆడవాండ్లు సీతను చీటికీ మాటికీ ఎత్తిపొడిచారు. ఇక ఆ వూళ్ళో ఉండడం దుర్భరం అయిపోయింది. ఓరోజు నా వుద్యోగానికి రాజీనామా యిచ్చి... ఈ మాలకొండకొచ్చా. అప్పటికి అదే... అంటే యిక్కడికి రావడం శ్రేయస్కరం అనుకున్నా. ఇద్దరుముగ్గురి పిల్లలకి ప్రైవేటు చెప్పడం... ఈ చిన్న దుకాణం... నా జీవితం నడిపేందుకు ముఖ్య సాధనాలయ్యాయి.'' రామారావు తన గుండెపై చెయ్యి పెట్టుకుని - 'అబ్బ' అని మూలిగాడు.

''ఏమయింది బాబాయ్'' కృష్ణ ఆదుర్దాగా అడిగాడు.

''యాభైలోపడ్డాను. ఈ మధ్య కొంచెం గుండెనొప్పి కూడ కనిపిస్తూంది'' రామారావు బదులు చెప్పాడు.

ఇంతలో సీత కమ్మటి మజ్జిగ రెండు గ్లాసుల్లో తెచ్చింది. ఇద్దరూ పుచ్చుకున్నారు. తర్వాత ...

''బాబాయ్, మా పరీక్ష ఫలితాలు రాలేదు. వెళ్ళి యూనివర్సిటీలో కనుక్కోవాలి. తరువాత తీరిగ్గా వచ్చి నీతో పది రోజులు గడిపేస్తా'' అని కృష్ణ చెప్పాడు.

''అ దే వి టీ! నా ల్రో జు లుం డి పోకూడదూ...'' అంటూ ఆప్యాయంగా అడిగింది సీత.

కాని రామారావు అడ్డు చెప్పలేదు. ఎందుకంటే కృష్ణ పరిస్థితి అతనికి తెలుసు. అయినా కృష్ణ బయల్దేరేటప్పుడు రామారావు ''వురేయ్ కృష్ణా...'' అని తాపీగా పిలిచాడు. 'ఏంటన్నట్లు' చూశాడు రామారావు వంక కృష్ణ.

'నాదో చిన్న కోరిక' అంటూ చేతులు నలుపుకోసాగాడు రామారావు.

''చెప్పు బాబాయ్'

''ఏం లేదురా, నేను ఇహ చాలా రోజులు బ్రతకనేమో. యాభైపైబడ్డాయి. ఆరోగ్యం కూడా అంతంతమాత్రమే. నేను పెళ్లయిన కొత్తల్లో మీ పిన్నికి ఓ దుప్పటి కొనిచ్చా. ఇన్నాళ్లుగా ఆ దుప్పటి ఆమె కప్పుకుంది. కాని అదిప్పుడు శిథిలావస్థలో వుంది. పోనీ కొత్తది మరొకటి కొందామంటే, నా పరిస్థితి చూస్తున్నావుగా. నైతికంగా ఇంకా ఆ బలం వున్నది. కాని ఆర్థికంగా చాల చితికి పోయాను. నేను చితికి పోయాను కద అని కాలం ఆగదు కదా! ఇది వేసవి. ఆ తర్వాత వర్షాకాలం వస్తుంది. ఆతదుపరి ప్రాణాలు తోడేచలి. తలచుకుంటేనే భయం వేస్తుంది. ఓ దుప్పటి మంచిది, గట్టిది తీసికొచ్చి ఇవ్వగలవా?'' రామారావు అర్థింపులో ఏదో భావానికి అందని అర్థం గోచరించింది.

''తప్పకుండా తెస్తాను బాబాయ్'' అన్నాడు కృష్ణ.

## మౌనం అయిదు భాషల్లో

రాలిన పండుటాకుల మధ్య
మూలుగుతున్న పసిమి
చెట్టు గుండెలోకి చొరబడుతుంది.
చివరి మూలుగు
చిగురు భాష తొడుక్కుంటుంది
చెట్టు ప్రసవిస్తుంది
పూల కళ్లనూ పళ్ల గుండెలనూ
గాలిపాడె మీదినుంచి
ఎండుటాకుల శవాలు
చేలలోకి దూకుతాయి
చచ్చిన ఆకులు మురిగి మురిగి
పచ్చని మొక్కలకు ప్రాణం అరువిస్తాయి
పంటను మేసి హరాయించుకున్న నోళ్ల
పడిపోతాయి నురగలు నురగలుగా
మట్టిలోంచి లేస్తాయి ఆ నోళ్ల
మౌనాన్ని అయిదుభాషల్లో ఊదుతూ.

**డాక్టర్ సి. నారాయణరెడ్డి**

తర్వాత బస్సెక్కి. సింగరాయ కొండ వరకూ వచ్చి సర్కార్‌లో ఇంటికి చేరాడు.

రైలు స్టేషనులో ఆగిన కుదుపులకి కృష్ణ ఈ లోకంకి రావటం, శాంతి కండ్లు తెరిచి తేరిపార చూస్తూ 'ఏ స్టేషనండీ' అని అడగటం రెండూ ఒ కే మా రు జరిగాయి. వెంటనే సామాను సర్దుకుని రైలుదిగి కృష్ణ, శాంతి యిద్దరూ ఓ బస్సులో కూర్చున్నారు. టైము చూసుకొన్నాడు. రాత్రి మూడు దాటింది. ఇంకో గంటన్నర బస్సు ప్రయాణం. 'ఇంకెంత సేపండీ' అంటూనే బస్సులోనే కన్ను కురికింది శాంతి.


''నిజంగా ఇం కెం త సే పు. ఓ గంట గంటన్నర. బాబాయి ఆశీర్వచనం తీసుకొంటే తృప్తిగా తనదాన్ని చేసుకోవచ్చు శాంతిని'' అనుకుంటూ శాంతి వైపు చూశాడు కృష్ణ. కోటేరేసిన ముక్కు, చక్రాల్లాంటి కళ్ళు, ఉంగరాల జుత్తూ, పై పెచ్చు ఆ నిర్మలమైన మొహంలోని ప్రశాంతత - తన్ను అట్టే ఆకట్టుకున్నాయి అనతి కాలంలోనే.

అవి కృష్ణ కొత్తగా విజయవాడ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరరుగా చేరిన రోజులు. అతను పని చేసే డిపార్ట్‌మెంట్‌లో శాంతి డెమాన్‌స్ట్రేటరు. శాంతి ఎప్పుడూ సింపిల్‌గా వుండేది. ముక్తసరిగా మాట్లాడేది. ఒకరోజు కృష్ణకి తెలిసింది. శాంతికి యిదివరకే వివాహమయ్యిందనీ, ఆమె భర్త ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తూ యాక్సిడెంట్‌లో మరణించాడనిన్నీ, అందుకే ఆవిడ ఈ ఉద్యోగం చేస్తున్నదనిన్నీ, ఇద్దరి పరిచయం పెండ్లిదాకా వెళ్ళింది. కృష్ణ తన అమ్మానాన్నలతో చెప్పాడు ఈ విషయం. అమ్మ రుక్మిణమ్మ కష్టమంది. నాన్న పరంధామయ్య యేమీ అనక పోయినా రుక్మిణితో '' అమ్మాయిది మనకులమేనట'' అని మాత్రం అనగలిగాడు.

''అంటే సాటి కులమైతే సరిపోయిందా? వరుసా వాయీ అక్కర లేదా? శుభమా అంటే, ఎవడో పెండ్లికూతురు ముండా అని అన్నాట్ట. ముండ మోసినదాన్ని నా కోడలుగా చేసికుంటానా? నా కంఠంలో ప్రాణముండగా కుదర్దు'' రుక్మిణమ్మ ఘంటా పథంగా చెప్పింది.

''అమ్మా - శాంతి చాల మంచిది. విధవ అయినంతమాత్రం చేత పెండ్లికి తగదా? నేను తప్పకుండా శాంతినే పెండ్లాడుతా!'' అని కృష్ణ గట్టిగా చెప్పాడు.

పరంధామయ్య వింటూ త ట స్థం గా




చూస్తున్నాడు. రుక్మిణమ్మ సత్యభామలా రెచ్చిపోయింది.

"అవును ఎందుకు చేస్కోవూ, అయినా బెల్లం కొట్టిన రాయిలా వుంటారేవండీ! బుద్ధులు ఎక్కడికి పోతాయ్? మీ బాబాయి ఓ భోగం ముండతో సంసారం చేస్తున్నాడు. నీవేమో ఓ వెధవ ముండతో కులుకుతానంటున్నావు."

"బాబూ! ఇంకో సంబంధం చేసికోరా?" అని అన్నాడు.


"అమ్మా, బాబాయి నెందుకలా అంటారు. వారేం తప్పుచేశారు. సమాజంలో చోటులేని ఓ నిరాశ్రితను దగ్గరకు తీసి పెండ్లాడి ఆదర్శ జీవితం గడుపుతున్నాడంటే, నీలాంటి వాళ్ళున్నంత వరకూ ఆడదానికి గౌరవం లేదు ఈ లోకంలో. పరిస్థితుల ప్రభావంవల్ల ఓ ఆడది వేశ్య అయితే, ఈ రోజు విధిఆడిన చెలగాటంలో శాంతి విధవ అయింది. అంత మాత్రం చేత ఆడది శపించబడాలా? మీరెన్ని చెప్పినా నేనా పిల్లనే చేసుకుతీరుతా!"

"అవునురా - నీ స్వార్థం నువ్వు చూసుకుంటున్నావుగాని - రేపు నీ చెల్లిలిని మరెవరు పెళ్లి చేసుకుంటారు? ఫలానా వారి అబ్బాయి వెధవముండను చేసుకున్నాడూ అంటే మన అమ్మాయిని చేసుకోవడానికి ఎవరు ముందు కొస్తారు?" పరంధామయ్య స్పష్టీకరించాడు. "చేసుకోరా, చేసుకో, మమ్మల్ని చంపి, నీ చెల్లి రాధ గొంతునులిమి మరీ ఆ ముండకి తాళి కట్టు" రుక్మిణమ్మ సాధించింది. "అవసరం లేదు. నేను వెళ్తున్నా-శాశ్వతంగా ఈ యింటి నుండివెళ్తున్నా - రాధ పెళ్లికాదని భయపడ నవసరం లేదు. మీరు ఆశ్వీర్వదించకపోయినా సర్వదా బాబాయి ఆశ్వీర్వాదముంది."

"అందుకేగా వెళ్ళావు - వేసంగిలో - తన ఆదర్శం అంతా వెలగబెట్టి వుంటాడు. నేను ఇద్దర్ని కనలేదు - ఒకతెనే కన్నాననుకుంటా. వెళ్లరా - వెళ్లు. ఈ క్షణంనుండీ రాధే మాకు కొడుకూ, కూతురూనూ." నిక్కచ్చిగా చెప్పింది రుక్మిణమ్మ. పరంధామయ్య చూస్తూ - నీళ్ళు నములుతూవుంటే కృష్ణ వెళ్లిపోయాడు. వెంటనే సంక్రాంతి శలవుల్లో కరవది వెళ్లిన శాంతిని వెంటబెట్టుకొని బాబాయి






ఆశ్వీర్వాదం కోసం బయల్దేరాడు కృష్ణ.

* * * * *

బస్సు మాలకొండ సమీపానికి వచ్చింది. శాంతి కూడా మేల్కొంది. అప్పుడప్పుడే కటిక చీకటి కరిగిపోతూంది. కొండ శిఖరాలు మసక మసగ్గా కనిపిస్తున్నాయ్. రాత్రంతా నిదురించిన గొర్రెమందల్లోంచి అరుపులు వినిపిస్తున్నాయ్. పకులు కి ల కి ల ·లు సూర్యోదయాన్ని సూచిస్తున్నాయ్. గొల్లలు దుప్పట్లు కప్పకొని అటూ ఇటూ తిరుగుతున్నారు. మంచు దట్టంగా కప్పకొంది. చలి విపరీతం. ' శాంతీ!' మనం వచ్చేశాం.' ఇప్పుడు శాంతిలో ఓ తీయని తృప్తికనిపిస్తోంది. కృష్ణకూడ పెట్టె అవీ సర్దుకుని మళ్లీ ఓసారి పిన్నికోసం తెచ్చిన దుప్పటి చూసు కున్నాడు. తృప్తితీరా గాలి పీల్చాడు. ఇంతలో బస్సాగింది. దిగగానే ఎదురుగా టూరిస్ట్ బస్ వద్ద మనుష్యుల్ని చూసి ఇద్దరూ ఆశ్చర్య పోయారు. పరంథామయ్య, రుక్మిణమ్మ, రాధలు ఎదురుగా వచ్చి పలకరించారు.

"నీ కాశ్చర్యం వేస్తుంది కదూ మేమెలా వచ్చామా అని. నీవిక్కడికి వస్తావని తెలుసు." అంటూ రాధ జరిగిన సంగతంతా యిలా చెప్పింది.

* * * * *

'అమ్మా నాన్నలతో కృష్ణ గొడవపడి వెళ్లి పోయిన తర్వాత రాధ కూడ తన విషయం చెప్పింది. రాధ తనతో చదివిన ఓ అబ్బాయిని ప్రేమించింది. వీరి కులం వారికులం వేరు. వితంతు వివాహానికే అంగీకరించని అమ్మా నాన్నలు తన పెళ్ళికెలా అంగీకరిస్తారు? రాధ విషయం తెలిసిన తర్వాత రుక్మిణమ్మ రంకెలు వేసింది. కాని తటస్థంగా వున్న పరంథామయ్య పురివిప్పి చెప్పాడు.

"రుక్మిణీ! మారుతున్నసమాజంతో మనం రాజీపడాలి. అప్పటికీ యిప్పటికీ ఎన్ని విలువలు మారాయి. ఆచారాలూ కులాలూ, మతాలూ యివి అప్పటి సమాజ సంస్కృతికి గీటురాళ్ళు, ఇప్పుడవికాదు. మనిషిలో జీవితం మీద ఆసక్తి, ఆప్యాయత, అభిమానం ఎంతవుందీ అన్నదే ముఖ్యం. ఈ మమత లోతుల్లో తొంగి చూస్తే ఈ మతాలూ, ఆచారాలూ అడ్డురావు. సుఖం



Chhaya/PP/415

ఇంకా అప్పటివే పట్టుకు కూచుంటే కష్టం!'' అంటే "అనాచారం అంటకట్టుకోవాలా'' మూతిముడుస్తూ రాగం తీసింది రుక్మిణమ్మ.

"ఆచారం - అనాచారం... ఇది మనం కల్పించుకున్నవి. ఒకప్పుడు మాతృసత్తాత్మక పరివారంలో స్త్రీ ప్రాధాన్యత, మరొకప్పుడు పితృసత్తాత్మక పరివారంలో పురుషుని ప్రాధాన్యత వుండేది. ఒకప్పుడు మాంసభక్షణం అన్నికులాల్లోనూ వుండేది. తర్వాత అది కొన్నింటికి ప రి మి తం అయింది. బహు భార్యాత్వం కొన్ని మతాల్లోవుంటే, ఏకపత్నీ వ్రతం కొన్నికులాల్లో, అమరలోకంలో వున్న స్త్రీలు ఎందరితో సంబంధం వున్నా పునీతలే. మరి భూలోకంలో, అంతెందుకు -దక్షిణ భారత దేశంలో మేనమామ కూతురికి తాళికట్టితే ఉత్తర భారతంలో అది నేరంగా భావిస్తారు. ఎక్కడిదీ ఆచారం? ధర్మంకోసం, న్యాయం కోసం, మనిషి మానసిక వికాసం కోసం సమాజంలో మార్పులు మహాత్ములు సృష్టిస్తారు. ఆనాడు రాముడు (రామారావు) చేసిన పని మనం హర్షించలేకపోయాం. ఈనాడూ అంతే... కాని నిజంగా మనం వెనుకబడ్డాం రుక్మిణీ! చలికి దుప్పటి ఎంత అవసరమో మానవునికి - మార్పు సమాజానికి అంతే అవసరం. స్త్రీకి - స్త్రీ గౌరవానికీ అంతకన్నా అవసరం - కొత్త నీరు రావాలి. పాతనీరు పోవాలి.''

రుక్మిణి మాట్లాడలేదు. కన్నకొడుకు దూరమయ్యాడు. రాధ యింటినుండి వెడ తానంటోంది. తనయిష్టమైన వాడితో పెండ్లి జరిపించకపోతే. మరి ఈ జీవితం ఎవరికొరకు? సత్యాసత్య విచక్షణ జరిగాక ఇద్దరూ రాజీపడ్డారు. అందుకే రాధను తీసికొని పరంధామయ్య, రుక్మిణి బయల్దేరారు టూరిస్టు బస్సులో. కృష్ణ కరవదివెళ్లి ఓరోజు ఆలస్యంగా రావడం, వీళ్ళ టూరిస్టు బస్సులో బయల్దేరడం దీంతో యిద్దరూ అక్కడ కలిశారు మాలకొండలో.

* * * * *

అందరూ కలిసి రామారావు యింటికి వెళ్ళారు. అప్పటికే ఇంటిచుట్టూ జనం మూగారు. ఏడుపులు వినిపిస్తున్నాయి. శవాన్ని బయట పెట్టారు. "పాపం గుండెపోటు భరించ లేక - సరైన వైద్యంలేక ఈ లోకం విడిచి పోయారు రామారావుగారు. పాపం సీతమ్మగారి గతేంకానో'' అన్నారక్కడి వాళ్ళంతా. అప్పుడే తెల్లవారింది. రాత్రంతా శవం ప్రక్కనే కూచుని కండ్లు కాయలు కాచేలా యేడ్చింది కాబోలు సీత. మొహం ఉబ్బినట్లుంది. చలికి గజగజ వణికి పోతూంది. అందరూ చూస్తుండగా సూట్‌కేస్‌లో దుప్పటి తీసి పిన్నికి కప్పాడు కృష్ణ. సీత తలెత్తి కృష్ణవంక రెండు క్షణాలు చూసి తృప్తిగా తలదించుకుంది. సీతకి ఆ క్షణంలో మూగపోయిన భవిష్యత్ వీణపై కోటి రాగాలు పలికింప జేసేందుకు, భర్తచావుతో మరుభూమిగా మారిన తన జీవితంలో నవ వసంతాలు చిగిరించేలా చేసేందుకు. చివరి క్షణాల్లో తన భర్తకీ. కొడుకులేని లోటు తీర్చేందుకూ, కొడుకుగా సమాజంలో తనకు శ్రీరామరక్షగా నిలిచేందుకు వచ్చిన ఆ కృష్ణలో కోటి దేవతలు కన్పించారు. కూలిపోయిన తన మమతల గోడలను తిరిగి సరిదిద్ది, పవిత్ర మందిరంగా తీర్చి దిద్దేందుకే ఈ కృష్ణ వచ్చాడు కాబోలు ననుకుంది. సీత చూస్తుండగానే కృష్ణ బాబాయ్ దహనసంస్కారానికి యేర్పాట్లు చేయటంలో మునిగి పోయాడు.

*



నిశ్శబ్దంగా మీకోసం పనిచేస్తున్నవి
- సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు

సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు పని చెయ్యడంలో అధిక పొదుపునిచ్చేవి, అత్యంత బలిష్ఠమైనవి ఏళ్ల తరబడి ఇబ్బంది కలిగించని సేవకు హామీ ఇచ్చేవి.
30 ఏళ్లనుండి ప్రీమియర్ పంపుసెట్లను తయారుచేస్తూవున్న సి పి సి వారివే ఇవి తయారుచేయబడుతున్నవి.
సి పి సి ప్రీమియర్ గృహోపయోగ పంపుసెట్లు 1/8 హెచ్.పి. నుండి 2 హెచ్.పి. వరకు గల సైజులలో లభ్యం.
సి పి సి ప్రీమియర్ పంపుసెట్లు యీ కంపెనీ బ్రాంచీలలోను, డీలర్ల మూలంగాను, అన్నిచోట్లా లభ్యమౌతున్నవి.
పంపుసెట్లు కొన్న తరువాత మీకు అవసరమైన సర్వీసు సౌకర్యాలు వారే చేయగలరు.



సిపిసి ప్రీమియర్
మీ కుడిచేయి వలె విశ్వసించ తగినది

కోయంబత్తూరు ప్రీమియర్ కార్పొరేషన్ (P) లిమిటెడ్
17-2-30, పొన్నియమ్మన్ కోయిల్ వీధి
చిత్తూర్-517 001 ఫోను : 3228 Grams : PREMIER CO.

23 TG/AJ/V

అడ్మిషనులు ప్రారంభమయినవి
స్కూలు పునః ప్రారంభం
4 జూన్ 1985

స్థాపితము:1962 ఫోన్:22084



శ్రీ విద్యా విహార్ & శ్రీ విద్యా విహార్ పబ్లిక్ స్కూల్
"ఆదర్శ గురుకుల విద్యాసంస్థలు"
లలితానందనగర్, రింగురోడ్, గుంటూరు-522006
బ్రాంచి: దాసరివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2

నర్సరీ నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు & తెలుగు మీడియంలలో తరగతులు. ఇంకనూ-సైనిక స్కూలు, కోరుకొండ; పబ్లిక్ స్కూళ్ళ స్కాలర్‌షిప్స్ పరీక్షలు; డెహరాడూన్ మిలటరీ స్కూలు; తాడికొండ, సర్వేల్లి మొ॥ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూళ్ళ పరీక్షలు మొదలగు ప్రవేశపరీక్షలకు ప్రత్యేక శిక్షణ.

★ స్థానికులకు స్కూలు బస్ సౌకర్యము కలదు ★

APPLICATIONS ARE INVITED FOR TEACHER POSTS

PRAGATHI • advar..